విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 29, సెప్టెంబర్ 2025

మురుగు.. దరువు

పొంగిన వాగులు, వంకలు

విశాలాంధ్ర- చాగలమర్రి : భారీ వర్షాలకు కలుగోట్లపల్లె,బ్రాహ్మణపల్లె గ్రామాల ముంగిట ఉండే వక్కిలేరు వాగు రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తోంది. గత రెండు రోజులుగా పైతట్టు ప్రాంతాల్లో కురుస్తున వర్షాలకు వాగులు,వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని కలుగోట్లపల్లె,బ్రాహ్మణపల్లె రహదారిపై గల వంతెనలపై వక్కిలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్థంబించి పోయాయి. వాగులు పొంగిన ఆయా గ్రామాల ప్రజలు వరద ఉధృతి తగ్గే వరకు వంతెనల వద్దకు రావద్దని తహసీల్దారు విజయ్‌కుమార్,ఎస్ఐ సురేష్‌లు సూచించారు.

- దుర్వాసనతో అల్లాడుతున్న కాలనీవాసులు
- అడుగుకో దిబ్బ.. వెళ్లాలంటే ఇబ్బంది

విశాలాంధ్ర - రుద్రవరం : స్వచ్ఛతపై అధికారులు నెలకోసారి ప్రత్యేక దృష్టి పెడుతున్నప్పటికీ ప్రజలకు రావాల్సిన వ్యాధులు వస్తూనే ఉన్నాయి. అడుగుకో దిబ్బ ఆ దారిలో వాహనదారులు గ్రామస్తులు పాఠశా లకు వెళ్లే విద్యార్థులు ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక ఉన్నత పాఠశాల వెనుక ఉన్న కస్తూరిబా గురుకుల పాఠశా లకు వెళ్లే ప్రధాన రహదారి వెంట అడుగడుగున దిబ్బలతో నిత్యం దుర్వాసన వెదజల్లుతూనే ఉంది. రాస్తా సమీపంలో ఉన్న పలు కాలనీవాసులు దోమలతో ఇప్పటికే రోగాల బారిన పడిన దుస్థితి నెలకొంది. అదే రస్తా లో గ్రామస్తులతో పాటు కాలనీవాసులు విద్యార్థులు వెళ్లాలంటే అక్కడ వచ్చే దుర్వాసనతో ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పూర్తిగా పారిశుధ్యం లోపించి అటు దుర్వాసనతో, ఇటు దోమలతో ఎన్నో అవస్థలు ఇబ్బందులు పడుతున్నామంటూ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి కాలనీలో పారిశుధ్యం లోపించకుండా తగిన చర్యలు చేపట్టి ప్రజలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాలనీవాసులు తెలిపారు.

భగత్ సింగ్ ఆశయాలను సాధిద్దాం

భగత్ సింగ్ జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలి

విశాలాంధ్ర-డోన్ : భారతదేశ స్వతంత్ర సమరయోధుడు, యువతకు ఆదర్శప్రాయుడు సర్దార్ భగత్ సింగ్ 118 జయంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం డోన్ పట్టణంలోని రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు సొంటి లక్ష్మీనారాయణ, నంద్యాల జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్ మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం కావాలని పోరాటం చేసి దేశంలో ఉన్నటువంటి యువతకు ఆదర్శప్రాయుడుగా సర్దార్ భగత్ సింగ్ వారి జీవిత చరిత్ర యువత ఆదర్శంగా తీసుకోవాలని వారు కోరారు. దేశంలో స్వతంత్ర ఉద్యమ కారుల చరిత్ర కాకుండా దేశద్రోహుల చరిత్ర ఈ బీజేపీ ప్రభుత్వం పాఠ్యాంశాలలో ఎక్కించడం దుర్మార్గమైన చర్య అని, స్వతంత్ర ఉద్యమంలో పాల్గొని ప్రాణాలర్పించిన ఉద్యమకారుల యొక్క జీవిత అంశాలను పాఠ్యాంశంలో ఎక్కించి విద్యార్థులకు బోధించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డోన్ మండల అధ్యక్షులు శశిధర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు అస్లాం, ధనుష్, మహేష్, అక్రమ్, కుళాయి స్వామి, వెంకీ, మనోహర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని ఎస్ఆర్ పంక్షన్‌హాల్ సమీపంలో లారీ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ఎస్ఐ సురేష్,టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్‌భాషలు రిబ్బన్ కట్ చేసి ఆదివాం ప్రారంభించారు. అనంతరం లారీ యజమానులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. లారీ ఓనర్ల సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే వాటిని కచ్చితంగా పరిస్కరి స్తామని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ డైరెక్టర్ ముల్లా అజీం,కొలిమి హుస్సేన్ వల్లి, మౌళాలి, హనీఫ్, దాదాబీడీ మహబూబ్ భాష,టిఎన్ఎల్ పుల్లయ్య, అమీర్, నాగూర్, కరిముల్ల, జల్సా గౌస్, లారీ యజమానులు ఉప్పుమాభాష, పెద్దమ హమ్మద్,చిన్నమహమ్మద్,కరిముల్లా,గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అనిల్ కుటుంబాన్ని శిల్పా పరామర్శ

విశాలాంధ్ర - వెలుగోడు: వెలుగోడు పట్టణం నందు సోషల్ మీడియా అనిల్ మాతృవియోగం కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ప్రమాదంలో మరణించారు. వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యు లను మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి పరామర్శించారు. తమ సానుభూతి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం ఈ కుటుంబాన్ని ఆదుకోవా లన్నారు. వైసీపీ కార్యాలయం నందు డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆవిష్కరించారు. డిజిటల్ బుక్ కార్యకర్తలకి జగనన్న ఇస్తున్న భరోసా, అభయం అని తెలిపారు. కార్యకర్తలకు అండగా నిలిచేందుకే ఈ డిజిటల్ బుక్ యాప్ ఆవిష్కరించారు. వైసీపీ నాయకులు అబ్దుల్ ద్వితీయ కుమా రుడి వివాహ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి,మండల వైఎస్ఆర్ సీపీ నాయకులు అంబాల ప్రభాకర రెడ్డి, ఇలియాస్, షాంషీర్ పాల్గొన్నారు.

నకిలీ సేమియా ప్యాకెట్లను కొని మోసపోకండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు గత 42 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్న వివిఎస్ ఆర్ బ్రాండ్ కలిగిన ఆదితన్ రోస్టెడ్ సేమియాలనే వాడండని, నకిలీ సేమి యా ప్యాకెట్లను కొని మోసపోకండని డీలర్ చాంద్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది వ్యాపారులు తమ కంపెనీ పేరును ఏమారుస్తూ మార్కెట్లోకి తమ స్వార్థంతో తమ ఆదాయం కోసం నకిలీ బ్రాండ్లతో తమ బ్రాండ్ల పేరును, కవరును, డిజైన్‌తో పోలి ఉన్నట్టు, నాణ్యత, ప్రభుత్వ గుర్తింపు లేని నకిలీ పేర్లతో ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడు తున్నారని ఆయన ఆరోపించారు. కాబట్టి ప్రజలు గమనించి ప్రభుత్వంచే ఆమోదం పొందబడి, క్వాలీఫైడ్ అయిన వివిఎస్ఆర్ ఆదితన్ రోస్టెడ్ సేమియా పేరు గల ఒరిజినల్ సేమ్యాలను వాడాలని, నకిలీ పేర్లతో వచ్చే నాణ్యత లేని సేమియాలను వాడకుండా వాటిని అరికట్టాలని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసామని సేమియా డీలర్ చాంద్ భాషా తెలిపారు.

రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడితే ఏ ఒక్కరిని విడిచిపెట్టం : కాటసాని

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్: రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడితే ఏ ఒక్కరిని విడిచిపెట్టం అని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. ఆదివారం బనగానపల్లెలోని వైసీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను వైసీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి అధికారి,పచ్చ కూటమి నాయకుల కక్ష్య సాధింపు చర్యలు వివరాలు డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తున్నాం అని అన్నారు. రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడితే ఏ ఒక్కరిని విడిచిపెట్టం అని అందరి లెక్కలు సరి చేస్తాం.. సమయం వచ్చిన తరువాత వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తాం అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, బనగానపల్లె నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ అబ్దుల్ ఖైర్, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి అంబటి రవికుమార్ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : శాసనసభలో తమ అధినేత వైయస్ జగన్ రెడ్డిపై ఎమ్మెల్యే బాలకృష్ణ అధికార దాహంతో వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం పట్టణంలోని వైకాపా కార్యాలయంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే డిజిటల్ బుక్‌లో నమోదవుతుందన్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్యాయం జరిగిన కార్యకర్తలకు అందరికీ న్యాయం చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ కార్య దర్శి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, డాక్టర్ శీలం సురేంద్రనాథ్ రెడ్డి, సింగం వెంకటేశ్వర్ రెడ్డి, రాజారెడ్డి, బత్తుల కృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పోరేట్ వైద్యం : పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్య ంలో పేదల కోసమే కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరాలు నిర్వ హిస్తున్నట్లు శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో 60వ మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకే పెద్దరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నా సొంత గ్రామ ప్రజలకు మంచి వైద్యం అందించేందుకే ప్రతినెల ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతినెల చివరి ఆదివారం రోజున పేదలకు వైద్య శిబిరంతో పాటు ఉచితంగా మందులు అందిస్తూ తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడమేనని తెలిపారు. ఉచిత వైద్య శిబి రంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తమ సొంత ఖర్చులతో ఉచితంగా భోజన వసతిని కల్పిస్తూ మంగపల్లె గ్రామంలోని ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నామన్నారు.

మహిళా మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

అభినందించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: ఆత్మకూరు సబ్ డివిజన్ లోని ఆత్మకూరు పోలీస్ టౌన్ స్టేషన్ పరిధిలో కొట్టాల చెరువు గ్రామం నందు శాంతి భాయ్ అను ఆమె కనిపించడం లేదని ఆమె మొదటి భర్త కొడుకు కాశీ విశ్వేశ్వర నాయక్ మే 16 2023లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు వివిధ రకాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ సదరు మిస్సింగ్ పర్సన్ గురించి ఇప్పటివరకు వెతికిన ఎక్కడ కనిపించలేదు. ప్రస్తుతం ఆత్మకూరు టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ నారాయణరెడ్డి తిరుమల బ్రహ్మోత్సవాల బందోబస్తులో ఉండగా 2023లో మిస్సింగ్ కేసులో నమోదు చేయబడిన శాంతి భాయ్‌ని తిరుమలలో ఆమెను గుర్తించి ఆమె భర్తను పిలిపించి డబ్ల్యూ పీసీ 4003 స్వర్ణ సహాయంతో రికార్డు చేయించి తిరుమల నందు తహసీల్దార్ లేనందున ఆమె భర్త మూర్తికి అప్పగించారు. ఈ సందర్భంగా బందోబస్తు విధులు నిర్వహిస్తూనే 2023 సంవత్సరంలో మహిళా మిస్సింగ్ కేసులో నమోదు సుమారు రెండు సంవత్సరాల నాలుగు నెలలు కాబడిన వ్యక్తిని గుర్తించి వారి భర్తకు అప్పగించినందుకు నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ ఆత్మకూరు పోలీసులను అభినందించారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని రామాపురం గ్రామంలో గల సాయిబాబా మందిరం నందు సాయిబాబా 190జన్మదినం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి, బనగానపల్లి రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేకును కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్.రామకృష్ణారెడ్డి, నాయుడు, చింత మనోహర్ రెడ్డి, డాక్టర్ మోహన్, శేఖర్, సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర - బనగానపల్లె: రేషన్ సరఫరాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ,రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంస్కరణలో భాగమే కార్డుదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారని మిట్టపల్లి గ్రామ సర్పంచ్ యడమకంటి తులసి రెడ్డి, వీఆర్వో మధు పేర్కొన్నారు. ఆదివారం నాడు మండల పరిధిలోని ఇల్లూరు కొత్తపేట గ్రామ సచివాలయం పరిధిలోని మిట్టపల్లి గ్రామం నందు నందు మిట్టపల్లి గ్రామ సర్పంచ్ యడమ కంటి తులసి రెడ్డి, గ్రామ విఆర్ఓ మధు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటింటికి తిరిగి రేషన్ కార్డు హోల్డర్లకు ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వడిసెల రామసుబ్బారెడ్డి, నారపురెడ్డి రామసుబ్బారెడ్డి, యన్నం వెంకటసుబ్బారెడ్డి, డీలర్, హుస్సేన్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాలరాత్రి అలంకారంలో భ్రమరాంబ దేవి

గజ వాహనంపై శివపార్వతులు

విశాలాంధ్ర - శ్రీశైలం : శ్రీశైలం మహా క్షేత్రంలో దసరా మహోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు అయిన ఆదివారం నాడు శ్రీ భ్రమరాంబా దేవి అమ్మవారు కాలరాత్రి అలంకారంలో శివపార్వతులు గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉత్సవాల్లో భాగంగా దేవాలయాల్లో ఆలయ అర్చక వేద పండితులు ఆగమ శాస్త్రానుసారంగా ఉత్సవ పూజలను నిర్వహించారు. సాయంకాలం ఉత్సవమూర్తులను ప్రత్యేక పూలతో నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరింపజేయించి మరొకరు ఉత్సవమూర్తులకు మహా మంగళారతులు ఇచ్చి విద్యుత్ దీప కాంతుల నడుమ మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను గ్రామోత్సవానికి తోడుకొని వచ్చారు. ఈ గ్రామోత్సవం శ్రీశైల పురవీధుల్లో ఎంతో వైభవంగా ముందుకు సాగింది. ఈ విశేష కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు ఆలయ అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను చూసి తమ తమ మొక్కులు తీర్చుకున్నారు.

ఏపీపీ హెచ్‌సీడీసీఏ జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ అంకిరెడ్డి ఎన్నిక

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : నంద్యాల జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల సంఘం ఏపీ హెచ్సిడిసిఏ జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ అంకిరెడ్డి ఎన్నికైనట్లు నంద్యాల జిల్లా డిఎంహెచ్ఓ వెంకటరమణ తెలిపారు. ఎన్నికలు శనివారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. ప్రస్తుతం ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలు బడ్డాయి. రాష్ట్ర ఏపీపి హెచ్ డిసిఏ ఆదేశాల మేరకు డిఎంహెచ్ఓ డా.ఆర్.వెంకటరమణ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా వైద్య సంఘాల అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ మొత్తం 82 మంది ఏపీపీహెచ్ సిడిసిఏ సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించడం జరిగిందన్నారు. రిటర్నింగ్ అధికారి ఫలితాలను ప్రకటించగా కొత్త బాడీ 2025-2027 రెండు సంవత్సరాలు పాటు పదవి కాలంలో కొనసాగుతా మన్నారు. కొత్త కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ డాక్టర్ కె.అంకిరెడ్డి జనరల్ సెక్రటరీ డాక్టర్ చెన్నకేశవులు ట్రెజరర్‌గా నేగల ఉసేని ఇతర కమిటీ సభ్యులు వివరాలు వెల్లడించారు. అంకిరెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏపీపీహెచ్డిసిఏ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషకరంగా ఉందన్నారు. ఎన్నికైన సభ్యులు జిల్లా కమిటీ నాయకులు నాపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్క సభ్యునికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ప్రభుత్వ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, వైద్య సిబ్బంది సంక్షేమం కోసం, ప్రాథమిక ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత సమర్థంగా కమిటీ కృషి చేస్తుందన్నారు.అనంతరం వైద్యులు పరస్పరం అభినందించుకొని, వైద్య సేవల బలోపేతానికి సమిష్టిగా కృషి చేస్తామని వాగ్దానం చేశారు.

ఐక్యతతోనే ఏదైనా సాధ్యం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: ఐక్యతతో ఏదైనా సాధించవచ్చునని, ఆర్యవైశ్యుల అభివృద్ధిలోకి తన వంతు కృషి చేస్తానని ప్రపంచార్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు, టీడీపీ వాణిజ్య విభాగాల నంద్యాల జిల్లా అధ్యక్షులు నియోజ కవర్గ ప్రముఖులు టంగుటూరి శీనయ్య అన్నారు. దసరా శరన్నవరాత్రులు కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె నియోజకవర్గం కోవెలకుంట్ల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండెకంటి సుబ్రహ్మణ్యం, యువజన అధ్యక్షులు కర్నాటి అభిలాష్ ఆహ్వానం మేరకు కోవెలకుంట్లకు విచ్చేసిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్యకు ఘనస్వాగతం పలికారు. ముందుగా అమ్మవారి శాలకు టంగుటూరి శీనయ్య చేరుకోగానే స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టంగుటూరి శీనయ్యకు, వెంకటసుబ్బయ్య,జక్క నాగరాజులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టంగుటూరి శీనయ్య అంటే మమకారానికి మారుపేరని ఆర్యవైశ్యులకు అండగా నిలిచిన ఏకైక గొప్ప వ్యక్తి అని అన్నారు. కోవెలకుంట్ల అమ్మవారి శాల కార్యక్రమంలో పాల్గొన్నందుకు టంగుటూరి శీనయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

విష జ్వరాల విజృంభన

పెరుగుతున్న డెంగ్యూ లక్షణాల కేసులు

కిక్కిరిస్తున్న ప్రైవేట్ హాస్పిటల్‌లు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : విష జ్వరాల వ్యాప్తితో గ్రామీణ ప్రాంతాల ప్రజలు విలవిలలాడుతున్నారు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, భారీ వర్షాలు, కొత్త నీటి చేరికతో సీజనల్‌గా జ్వరాలు విజృంభిస్తున్నాయి. దోమల వృద్ధి కూడా విపరీతంగా పెరగడంతో వైరల్ ఫీవర్లతోపాటు, డెంగ్యూ లక్షణాలు కలిగిన జ్వరాలు కూడా పెరుగుతున్నాయి. డెంగ్యూ లక్షణాలు కలిగిన జ్వరాలు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.దీనికి తోడు జలుబు,దగ్గు, నొప్పులతో కూడిన జ్వరాల బారిన కూడా పడుతు న్నారు. మండల వ్యాప్తంగా విష జ్వరాలు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మూడు వారాలుగా వైరల్ ఫీవర్‌ల బారిన పడిన రోగులు ప్రైవేట్ హాస్పిటల్‌కి క్యూ కడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్తున్నా రోగులు మాత్రం ప్రైవేట్ హాస్పిటల్స్ బాట పడుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ హాస్పిటల్ కూడా అందిన కాడికి దోచుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లు వేత్తుతున్నాయి. ఇటీవల మీర్జాపురం, మదనంతపురం గ్రామాలలోని ఇరువురి చిన్నారులు డెంగ్యూ బారిన పడడంతో నంద్యాలలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తల్లిదండ్రులు తరలించి చికిత్స చేయించడంతో కోలుకున్నారు. వీటికి తోడు వైరల్ ఫీవర్‌లు కూడా విపరీతంగా పెరుగుతూ ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా వరకు వ్యాధుల బారిన పడినవారు ఆయా గ్రామాల్లోని ఆర్.ఎం.పిల వద్దనే చికిత్స తీసుకుని నయం కాకుంటే ఆ తర్వాత పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. వైరల్ ఫీవర్ సోకి ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే వైద్య ఖర్చులు తడిసి మోపెడుఅవుతున్నట్లు చెపుతున్నారు. మండలంలోని అంకిరెడ్డిపల్లి, బందర్లపల్లి, చింతలాయపల్లి, కనకాద్రిపల్లి,పెట్నికోట, తుమ్మలపెంట, గోరుమాను పల్లి,బెలుం తదితర గ్రామాలలో జ్వరాలు వణికిస్తున్నాయి.

భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: భగత్ సింగ్ ఆశయాలను ముందు కు తీసుకెళ్తామని ఏఐవైఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నంద్యాల సీపీఐ కార్యాలయం నందు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు మురళీధర్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ ముఖ్య అతిదులుగా పాల్గొని మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నంద్యాల పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, నంద్యాల పట్టణ నాయకులు సాయి, మనోజ్,వెంకట్,రాఘవేంద్ర సలీం భాష,ధనుంజయ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా భగత్ సింగ్ 118వ జయంతి

విశాలాంధ్ర - బనగానపల్లె: భగత్ సింగ్ 118వ జయంతి సందర్భం గా ఆదివారం పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయం నందు ఏఐఎస్ ఎఫ్, సీపీఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ , ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో భగత్ సింగ్ అమరులైనారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, సీపీఐ మండల కార్యదర్శి శివ య్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు సంజీవులు, ఏఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శి చందు,మాథష్ తదితరులు పాల్గొన్నారు.

హరికృష్ణను పరామర్శించిన తాతిరెడ్డి తులసిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల రాయలసీమ ఆర్తో హాస్పిటల్‌లో కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న పతంగి హరికృష్ణను ఆదివారం మార్కెఫెడ్ స్టేట్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో పతంగి హరికృష్ణ మన ఊరు, మనబడి కార్యక్రమం ద్వారా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని, కొన్ని రోజుల క్రితం మిల్లులో పనిచేస్తుండగా కుడిచే యి వేళ్ళు కట్ కావడంతో రాయలసీమ ఆర్తో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పతంగి హరికృష్ణను పరామర్శించి ఆర్థికసాయం అంద జేశారు. టీడీపీ తరఫున మంత్రి ఎన్ఎండి ఫరూక్‌తో మాట్లాడి అన్ని విధాలుగా పార్టీ తరపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 29, సెప్టెంబర్ 2025

ఘనంగా వరల్డ్ హార్ట్ డే వేడుకలు

విశాలాంధ్ర - కర్నూలు : నగరంలోని కర్నూలు హెల్త్ క్లబ్‌లో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరల్డ్ హార్ట్ డే వేడుకల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, హైదరాబాద్ అపోలో హాస్పిటల్‌కి చెందిన సీనియర్ ఇంటర్వెషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రతాప్ చంద్ర, కర్నూలు హెల్త్ క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్, కర్నూలు హెల్త్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ భవానీ ప్రసాద్, చంద్రశేఖర్ కల్కుర, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భాన్ని పురస్కరించుకుని రూపొందించిన బీపీ హార్ట్ హీరో అనే ప్రచార బ్రోచర్లు రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ కర్నూల్ హెల్త్ క్లబ్లో కర్నూల్ హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం గుండె జబ్బులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వరల్డ్ హార్ట్ డే వేడుకలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కర్నూలు హెల్త్ క్లబ్ ను చక్కగా నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, కర్నూలు హెల్త్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్‌ను ఆయన అభినందించారు.

గొర్రెల పెంపకందారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మండలంలో 600కి పైగా గొర్రెల మృతి
- గొర్రెకు రూ.20 వేలు నష్టపరిహారము ఇవ్వాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర - ఆస్పరి : అధిక వర్షాలు, చలిగాలుల కారణంగా భారీగా గొర్రెల మరణం సంభవించడంతో గొర్రెల కాపరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని వలగొండ, బిల్లేకల్లు, కైరుప్పల, పుప్పాలదొడ్డి గ్రామాలలో పర్యటించిన ఆయన, చనిపోయిన గొర్రెలను పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ ఈ నెల 26న వలగొండ, పుటకలమారి, ఆస్పరి, కైరుప్పల, బిల్లేకల్లు, చెన్నంపల్లి, డి.కోటకొండ, ములుగుందం, దొడగుండ, తురవగల్లు, తంగరడోన గ్రామాల్లో సుమారు 600కి పైగా గొర్రెలు మృతి చెందాయని తెలిపారు. పేదవారు, గొర్రెల పెంపకమే వృత్తిగా ఆధారపడుతున్న కాపరులు తీవ్ర ఆవేదనలో ఉన్నారన్నారు. ప్రతి గొర్రెకు కనీసం రూ.20 వేల నష్టపరిహారం చెల్లించాలని, అదనంగా గొర్రెలను కాపాడుకోవడానికి షెడ్లు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా కురిసిన నిరవధిక వర్షాలే ఈ విపత్తుకు కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు బడా సాబ్, ఏఐవైఎఫ్ నాయకులు లక్ష్మన్న, రమేష్, సీపీఐ నాయకులు జయరాముడు, నాగేష, నాగరాజు, కృష్ణ, రాజు, ఎర్రస్వామి, గొర్రెల కాపరులు వీరప్ప, ఆంజనేయ, రంగన్న, బోరెడ్డి, తురువగల రామాంజనేయులు, పురుషోత్తం, కల్లవరి తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ: గొర్రెలు పెంపకం దారులను ప్రభుత్వం ఆదుకోవాలని చేతి వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కారన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల రోజులుగా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా వీచే చల్లటి గాలులకు ఆస్పరి మండలం బిల్లేకల్, వలగొండ, కలపర్రి, కైరుప్పల, డి.కోటకొండ, పుప్పాల దొడ్డి గ్రామాలలో 600కు పైగా గొర్రెలు మృతి చెందడం జరిగిందని, మృతి చెందిన గొర్రెల కాపరులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

మార్కండేయ యూత్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర -ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని స్థానిక తేరు బజార్ నందు పద్మశాలి కళ్యాణ మండపంలో మార్కండేయ యూత్ వారి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర కంటి వైద్యశాల వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో దాదాపు 168 మందికి వారిలో పిల్లలు, పెద్దలకు డాక్టర్ నాగ వంశీకృష్ణ ఉచిత కంటి వైద్య పరీక్షలతో పాటు వారికి కావాల్సిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఉచిత కంటి పరీక్ష చేయించుకున్న వారందరూ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించిన వారికి అభినందనలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆడిమి నవీన్ కుమార్, మోహన్ కృష్ణ, తాటికొండ శ్యామ్, సుర ఉదయ్, తరుణ్, లక్ష్మీకాంత్ మరియు పద్మశాలి సంఘం ప్రెసిడెంట్లు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడికి రాలేని వారు స్థానిక సచివాలయంలో అడ్మిన్ కార్యదర్శికి సైతం ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అన్ని సచివాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్‌ను అర్జీదారులు సంప్రదించే వెసులుబాటు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనకై పోరాడిన జాషువా

విశాలాంధ్ర - హొళగుంద: మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు ఏఈఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఆధునిక కవి, ప్రచారకులు, పోరాటయోధుడు గుర్రం జాషువా జన్మదిన కార్యక్రమం ఘనంగా జరిగింది. జన్మదిన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు చిదానంద మాట్లాడుతూ ఆధునిక కవి గుర్రం జాషువా మూఢ నమ్మకాల నిర్మూల కోసం ఎన్నో పోరాటాలు చేశాడని కొనియాడారు. ఉపాధ్యాయుడిగా, ప్రచారకుడిగా, కవి, సాహిత్య ఎత్తగా ఎదిగారని అన్నారు. సమాజంలో అగ్రవర్ణాలు వేధింపులు భరించలేక ఎన్నో అవమానాలు భరించి దళిత, శోషిత, పీడిత వర్గాల కోసం ఎంతో శ్రమించారన్నారు. జాషువా సాహిత్య రంగంలో రాష్ట్రానికి ఎన్నో గుర్తింపులు తెచ్చారని శాసనమండలి సభ్యులుగా ఎన్నికయ్యారని స్పష్టం చేశారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ నాయకులు జయప్ప గౌడ, కాశీ విశ్వనాథ, నిజగుణ, బీజేపీ కార్యదర్శి ఉల్లిగన్న, బీజేపీ నాయకులు మహేష్, రాజా, శివరాజ్ పాల్గొన్నారు.

నగర సుందరీకరణ పనులు వేగవంతం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు నగర ప్రధాన రహదారుల వెంట సుందరికరణ పనులు వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన బుధవారపేట, కలెక్టరేట్, గాయత్రి ఎస్టేట్ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేస్తూ, నగరాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిఈఈ గిరిరాజ్, పట్టణ ప్రణాళికాధికారి అంజాద్ బాష తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - నందవరం : మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో టీడీపీ నాయకులు రైస్ మిల్ నారాయణ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేశారు. అదివారం వీఆర్వో సమక్షంలో స్మార్ట్ కార్డును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ లబ్ధిదారులకు ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం, చక్కెర, నిత్యావసర సరుకులు మరింత పారదర్శకంగా అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందని, రేషన్ సరఫరాలో అక్రమాలను అడ్డుకట్ట వేసి ప్రజలకు మరింత సౌకర్యం కల్పించడం ప్రధాన ఉద్దేశమన్నారు. 65 ఏళ్లునిండిన లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయడంతో పాటు స్మార్ట్ కార్డులను అందించాలని డీలర్లకు సూచించారు. నాయకులు దావీదు, యర్రన్న, దాసు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలు చేపట్టాలి

విశాలాంధ్ర - ఆస్పరి : భగత్‌సింగ్ స్వతంత్ర ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని రక్షించుకోవడానికి ప్రజలందరూ సన్నద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బిల్లేకల్లు గ్రామంలో స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పాల్గొని మాట్లాడుతూ 1907 సెప్టెంబర్ 28న పాకిస్తాన్ పంజాబ్‌లో జన్మించిన భగత్ సింగ్ చిన్న వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై పోరాటానికి అంకితమయ్యారని, జలియన్వాలాబాగ్ ఘటన, లాలాలజపతిరాయిపై దాడి భగత్‌సింగ్ విప్లవానికి బీజం వేశాయని గుర్తు చేశారు. కుల, మత భేదాలను దాటికి దేశ సమైక్యత, స్వేచ్ఛ, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలు నేటికీ యువతకు మార్గదర్శకమని అన్నారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలనలో ఉద్యోగాల కల్పన, ధరల స్థిరీకరణ, రైతుల ఆదాయం పెంపు, మహిళా సాధికారత వంటి వాగ్దానాలు నిలబెట్టుకో లేకపోయిందని, ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ సంపదలు కార్పొరేట్లకు అప్పగించడంతో పేదరికం, నిరుద్యోగం మరింత పెరిగాయని ఆయన విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థలను సంఘ పరివార్ ఆధీనంలోకి తీసుకెళ్లి ఫెడరల్ స్ఫూర్తిని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. నేపాల్‌లో జెన్ జడ్ పేరుతో యువత పాలకులపై తిరుగుబాటు చేసి నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్టే, భారతదేశంలో భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత నిరుద్యోగం, పేదరికంపై పోరాడి మార్పు తేవాలి అని గిడ్డయ్య పిలుపునిచ్చారు. సీఈబీపై మండల కార్యదర్శి విరుపాక్షి, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు లక్ష్మన్న, రైతు సంఘం మండల అధ్యక్షుడు బడే సాబ్, సీపీఐ గ్రామ కార్యదర్శి జయరాముడు, నాయకులు నాగేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో.. దేశానికి స్వాతంత్రం కోసం 23 ఏళ్లకే ఉరి కమ్మని ముద్దాడిన భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి, యువజన లోకం ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.రంగన్న తెలిపారు. అనంతరం భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా ఎమ్మిగనూరులోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్-ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లిభగత్ సింగ్ చిత్రపటానికి ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.రంగన్న పూలమాలేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్ ఏఐవైఎఫ్ మాజి జిల్లా ఉపాధ్యక్షుడు తిమ్మాగురుడు, ఇస్మాయిల్, సీపీఐ నాయకులు సమీవుల్లా, భాస్కర్ యాదవ్, వీరేష్, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి, దస్తగిరి, రవి, సీపీఐ నాయకులు నరసింహులు, నాగరాజు, అబ్దుల్, రఫీ, బాలు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరులో.. యువతకు ఆదర్శప్రాయుడు,విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏపీవీవీపీఎస్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అక్షిత ట్రస్ట్ వారి సహకారంతో తల సేమియా చిన్నారుల కోసం స్వచ్ఛంధ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కర్నూలు అక్షిత ట్రస్ట్ లక్ష్మినారాయణ, శేఖర్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, సీపీఐ కార్యదర్శులు శేషకుమార్ యాదవ్, బి.రాజులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బుడగజంగల నాయకులు మద్దిలేటి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల...

డిజిటల్ యాప్‌లో దాడులు, దౌర్జన్యాల నివేదికల నమోదు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆలూరు : దాడులు, దౌర్జన్యాల వంటి సంఘటనలను తక్షణమే అధికారులకు నివేదించేందుకు ప్రజలకు సహాయపడే డిజిటల్ యాప్‌ను వైసీపీ ఎమ్మెల్యే విరుపాక్షి ఆదివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించి, యాప్ ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ యాప్ ప్రజల భద్రత కోసం రూపొందించబడింది. ఎవరైనా బాధితులు తమకు ఎదురైన దౌర్జన్యాలను, దాడులను ఈ యాప్ ద్వారా తక్షణమే అధికారులకు తెలియజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మరకట్టు ఎల్లప్ప, మునసపల్లి సోమన్న, మాజీ ఎంపీటీసీ భాస్కర్, మండల కన్వీనర్ మల్లికార్జున, మాజీ మండల కన్వీనర్ చిన్న ఈరన్న, అరికెర వెంకటేష్, వీరేష్, వరుణ్, గుర్రం హరి, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం



విశాలాంధ్ర - చిప్పగిరి: ఆలూరు నియోజక వర్గంలో పార్టీ బలోపేతం కొరకు కష్టపడిన ప్రతి టీడీపీ కార్యకర్తకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని, ఆలూరు అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ వైకుంఠం జ్యోతి అన్నారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలో టీడీపీ మండల కన్వీనర్ రాయచూరు షేక్షావలి, ఆలూరు బ్రాంచ్ కెనాల్ అధ్యక్షులు నగరడోన కిష్టప్ప ఆధ్వర్యంలో మండల టీడీపీ నాయకులు రామదుర్గం తిమ్మయ్య, గుమ్మనూరు అంపయ్యతో పాటు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆలూరు ఇంచార్జీ వైకుంఠం జ్యోతిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కొండా రామాంజనేయులు, సోమశేఖర్ నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వొకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు గుర్రం జాషువా ఎక్సలెన్స్ అవార్డు



విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: మహాకవి గుర్రం జాషువా 130వ జయంతి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజ్, బి.కాంప్, కర్నూలు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ విశిష్టమైన సేవలందించినందుకు గౌరవప్రదమైన గుర్రం జాషువా ఎక్సలెన్స్ అవార్డు 2025ను అందుకున్నారు. నవ్యాంధ్ర విద్యార్థి సమాఖ్య, ద్రావిడ నాడు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులో నిర్వహించిన కార్యక్రమంలో విద్యా రంగంలో ప్రతిభావంతమైన నాయకత్వం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి, సమాజ సేవలో చురుకైన పాత్ర వంటి అనేక అంశాల్లో ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ పురస్కారం ప్రదానం చేశామని, ఇది ఆయన నిబద్ధత, కఠిన శ్రమ, సమాజానికి అంకితభావంతో చేసిన సేవలకు నిదర్శనమని కార్యక్రమ నిర్వాహకులు అన్నారు. ఈ సందర్భంగా కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

సంప్రదాయం పేరుతో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

- నిఘా నీడలో బన్ని వేడుక
- డ్రోన్, అత్యాధునిక సిసి కెమారాలతో నిరంతర పర్యవేక్షణ
- కర్రలు లేకుండా బన్ని ఉత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి
- విశాలాంధ్ర ప్రతినిధితో సీఐ రవి శంకర్ రెడ్డి

విశాలాంధ్ర - ఆలూరు : హొళగుంద మండల పరిధిలోని దేవరగట్టులో వెలసిన మాళ మల్లేశ్వర స్వామి సన్నిధిలో జరిగే బన్ని ఉత్సవాన్ని సంప్రదాయం పేరుతో అల్లర్లు సృష్టించి. భక్తులను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆలూరు సీఐ రవి శంకర్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు స్థానిక సర్కిల్ కార్యాలయంలో విశాలాంధ్ర ప్రతినిధితో అయన మాట్లాడుతూ దేవరగట్టులో భక్తులు సంప్రదాయం పేరుతొ కర్రలతో కొట్టుకోవడం ద్వారా కలిగే దుష్ప్రాబవాలపై దేవరగట్టు పరిసరాల ప్రాంతాలలోని గ్రామాల్లో అవగాహణ సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలలో చైతన్యం తెస్తున్నామని చెప్పారు. బన్ని వేడుక ప్రశాంతంగా జరుగుతున్న తరుణంలో కొంతమంది అకతాయిలు అతిగా మద్యం సేవించి ఉత్సవంలో అల్లర్లు సృష్టిస్తున్నారన్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి వారిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

ఘనంగా గుర్రం జాషువా, భగత్ సింగ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - పత్తికొండ: పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం గుర్రం జాషువా, భగత్ సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జాషువా, భగత్ సింగ్ చిత్రపటాలకు ఎస్టీయూ, అరసం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నేటి యువతరం గుర్రం జాషువా సాహిత్య మార్గాన్ని, భగత్ సింగ్ పోరాట తత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ, ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ స్వామి యువతకు పిలుపునిచ్చారు. సామాజిక చైతన్యం కోసం, సమ సమాజ నిర్మాణం కోసం, బానిస సంకెళ్ల విముక్తి కోసం జాషువా పెన్ను ఉపయోగిస్తే, భగత్ సింగ్ గన్ను ఉపయోగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, బలరాముడు, ఆర్థిక కార్యదర్శి మారుతి, ఎస్టీయూ నాయకులు ఇక్బాల్, వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వీరస్వామి, వెంకటరాముడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి



విశాలాంధ్ర - దేవనకొండ: భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని, నేటి తరం యువతకు భగత్ సింగ్ జీవితం పూర్తి దాయకమని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కె.భాస్కర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎం. రామాంజనేయులు అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ 118వ జయంతిని పురస్కరించుకొని దేవనకొండ మండల కేంద్రంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రజాసంఘాల నాయకులు రామంజి, వీరాస్వామి, నాగరాజు, రామన్న, రవితేజ, వెంకటరాముడు, అజయ్ పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పంటపోలాలను పరిశీలించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గోనెగండ్ల: క్షేత్ర స్థాయిలో పంటపోలాలను పరిశీలించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి తెలిపినట్లు టీడీపీ సీనియర్ నాయకులు బి.రంగారెడ్డి తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులు నుంచి వరుసగా వర్షాలు రావడంతో గంజిహళ్లి గ్రామంలో మల్లేలవాగు ఎక్కి నీళ్లు గ్రామంలోకి వచ్చాయని, పంటపోలాలలోకి నీళ్లు వచ్చాయని విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డికి తెలిపాలమన్నారు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే రెవిన్యూ అధికారులకు, మండల అధికారులకు ఫోన్ చేసి గంజిహళ్లి వెళ్లాలని ఆదేశించడంతో అధికారులు గ్రామంలో పంటపోలాలు పరిశీలించాలని ఆదేశించినట్లు తెలిపారు.

దాసరి కుటుంబం అంతా ప్రజాసేవలోనే

విశాలాంధ్ర - చిప్పగిరి: ప్రజా సేవే ప్రాణముగా దాసరి కుటుంబమంతా ప్రజా సేవలోనే కొనసాగుతుండటం కాలనీవాసులకు ఆనందాన్ని ఇచ్చింది. ఆదివారం మండల కేంద్రమైన చిప్పగిరి ఎస్సీ కాలనీకి చెందిన దాసరి మేరీ ఈమధ్య ప్రకటించిన డీఎస్సీ ఫలితాలలో టీజిటి ఉపాధ్యాయురాలుగా ఎంపిక కావడంతో కాలనీవాసులైన ఎక్సైజ్ కానిస్టేబుల్‌వేపమాను మల్లయ్య, జూనియర్ అసిస్టెంట్ జగన్నాథ్, దాసరి మేరీని శాలవా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిప్పగిరి ఎస్సీ కాలనీలోనే దాసరి కుటుంబం దాసరి గోవిందప్ప ఆర్మీలో, డి. నారాయణస్వామి ప్రధానోపాధ్యాయుడుగా, డి.మధు ఆర్మీలో రాధిక సెంట్రల్ స్కూల్ ఉపాధ్యాయురాలుగా ప్రజలకు అందిస్తున్నారు. మేరీ తండ్రి ఓబులేసు మరణించినప్పటికీ, తల్లి రాణమ్మ ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ పట్టుదలతో చదివి డీఎస్సీకి ఎంపిక కావడం ఎంతో సంతోషించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర -పత్తికొండ: భారతదేశ స్వాతంత్రోద్యమ విప్లవ యువ కిశోరం సర్దార్ భగత్ సింగ్ 118 వ జయంతి వేడుకలను ఆదివారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్దార్ భగత్ సింగ్ చిత్రపటానికి ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి శివ మాట్లాడుతూ భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ ఆశయసాధనకు ఉద్యమాలు చేపదుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దయ్య, పట్టణ అధ్యక్షులు వినోద్, నజీర్, వీర, కాశీ తదితరులు పాల్గొన్నారు.

పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రత్యేక కానుక

విశాలాంధ్ర - సి.బెళగల్: పేద, మధ్యతరగతి కుటుంబాలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వమని టీడీపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీటీసీ వీరన్న గౌడ్ అన్నారు. ఆదివారం మండల టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అటు ప్రజలకు వ్యాపా రులకు సూపర్ జీఎస్టీ ప్రోగ్రాం కింద లబ్ధి చేకూర్చిందన్నారు. బాలాజీ వెంకటేష్, ముందరింటి ధనుంజయ, గౌస్ బాష, భీమన్న, చికెన్ వీరన్న, వడ్డే వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ ఇంచార్జీలు, క్లస్టర్ ఇంచార్జీలు తదితరులు పాల్గొనడం జరిగింది.

రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలి

విశాలాంధ్ర-గోనెగండ్ల: మండలంలోని గంజిహళ్లి, యనగండ్ల, ఐరన్ బండ గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీటి మునిగిన పంట పొలాలను సందర్శించి నష్టపోయిన రైతుల సమస్యలను వైసీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జీ బుట్టా రేణుక, పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు నీటిలో మునిగి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. మండలంలోని గంజిహళ్లి గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను, యనగండ్ల, ఐరన్ బండ, గ్రామాల్లో గాజులదిన్నె ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ వచ్చి చుట్టుపక్క గ్రామాలలో పంట పొలాల్లోకి నీరు వచ్చి మునిగిన పంటలను అధికా రులు వచ్చి నష్టాన్ని అంచనా వేసి వెంటనే నష్టపరిహారం ఇవ్వాలన్నారు. మండల అధ్యక్షులు వేముగోడు కృష్ణారెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం నాయకులు అల్వాల ప్రమోద్ రెడ్డి, రాష్ట్ర సాంస్కృతి విభాగం నాయకులు కాశీవిశ్వనాథ్ రెడ్డి, జిల్లా యువజన విభాగం కార్యదర్శి ఇమ్రాన్, మండల యువజన విభాగం అధ్యక్షులు జహంగీర్ భాష, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

సకాలంలో సరుకులు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర - ఓర్వకల్లు : ప్రజలకు సకాలంలో రేషన్ దుకాణాలు తెరిచి ప్రజలకు నిత్య అవసరాలు అందించాలని మండల తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. ఈ మేరకు నన్నూరులో ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ ద్వారా వచ్చిన నూతన రేషన్ స్మార్ట్ కార్డులను పార్టీ నాయకులతో కలిసి కార్డుదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.విశ్వేశ్వర రెడ్డి, తలారి విజేయుడు విద్యా కమిటీ ఛైర్మన్ జాకీర్ హుస్సేన్, శ్రీపతి బుజ్జప్ప ఖాజామియ్య, కానాల రాంభూపాల్ రెడ్డి సర్కార్ హుస్సేన్ బోయినపల్లి, కరీంఖాన్, తులశిధర్ రెడ్డి పట్టేల మోహన్, షంషుద్దీన్ కృష్ణుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు సౌలభ్యంగా స్మార్ట్ కార్డ్

విశాలాంధ్ర - చిప్పగిరి: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సౌలభ్యంగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని డేగుల హాల్ గ్రామ సర్పంచ్ నీలకంఠ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని డేగుల హాల్ గ్రామ రెవెన్యూ కార్యదర్శి దండు ఆంజనేయులు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నీలకంఠ ముఖ్య అతిథులకు హాజరై రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి 421 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూర అయ్యాయని తెలిపారు. గ్రామ చౌక దుకాణం డీలర్ ఎర్రమ్మ పాల్గొన్నారు.

పెట్రోల్ పంప్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: కర్నూలు నగరపాలక సంస్థ పెట్రోల్ పంప్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని మేనేజర్ ఎన్.చిన్నరాముడు సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఆయన పాత బస్టాండ్‌లోని కేఎంసీ పెట్రోల్ బంక్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. రికార్డులు, హాజరు తనిఖీ చేసి, కార్పొరేషన్ ఆదాయానికి ముఖ్యమైన ఈ పంప్‌లో నిర్లక్ష్యం, పొరపాట్లకు తావు ఇవ్వొద్దని సూచించారు. ఎల్లప్పుడూ ఇంధనం అందుబాటులో ఉంచి, సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలపాలని ఆదేశించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 29, సెప్టెంబర్ 2025

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ముస్లింలు వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా వక్ఫ్ బచావో ఆందోళనలో భాగంగా వచ్చే నెల మూడవ తేదీన చేపట్టిన భారత్ బంద్ ను విజయవంతం చేయాలని ఐకాసా నాయకులు పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలోని జేఏసీ కార్యాయంలో ప్రజాసంఘాలు, కుల సంఘాలు, హక్కుల సంఘాలు, వలు సంఘాల నాయకులు, సభ్యులు రాజ్యాంగ విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డుపై ప్రవేశపెట్టనున్న నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సమావేశాన్ని నిర్వహించారు. నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు మౌలానా అబ్దుల్ రసాది ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ భారత దేశంలోని ప్రతి పౌరుడు బాధ్యత అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కేవలం కుల మతాల మధ్య చిచ్చులు పెడుతూ అన్నదమ్ముల వలె ఐక్యమత్యంగా ఉన్నటువంటి ప్రజల మధ్య మత విద్వేషాల ను రెచ్చగొడుతు పాలన చేస్తుందని ఆరోపించారు. వీటిని విజ్ఞులైన సెక్యులర్ వాదులు ఎప్పటికప్పుడు ఖండిస్తున్నప్పటికీ మతోన్మాద శక్తులు కొత్త కొత్త పద్ధతులతో సమస్యలను ఉత్పన్నం చేస్తున్నాయని అన్నారు. ఆళ్లగడ్డ జేఏసీ కన్వీనర్ బీరువాల భాష మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టంను రుద్దేందుకు ప్రయత్నిస్తుందన్నారు. వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు కొంత ఉపశమనం కలిగించిన వక్ఫ్ చట్టం పూర్తిగా రద్దు కాకపోవడం, మిగిలిన నిబంధనలు వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ జోక్యం కు గురిచేస్తాయనే భయం ముస్లిం సమాజాన్ని సంతృప్తి చేయలేదన్నారు. అఖిలభారత రజక సంఘం నాయకుడు ఆమదాల రమణ, బీసీ సంఘం నాయకులు వెంకట నరసయ్య, వెంకటసుబ్బయ్య రాష్ట్ర మాల మహానాడు నంద్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ ఎర్రమల చక్రవర్తిలు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం పునఃనిర్మాణాన్ని పరిశీలించిన ప్రముఖులు

విశాలాంధ్ర – కోడుమూరు: విశ్వ హిందూ పరిషత్ దక్షిణ భారతదేశ అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, బజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్ తూముకుంట ప్రతాపరెడ్డి, ఉమ్మడి జిల్లా భజరంగదళ్ కన్వీనర్ రాజేష్,విజ్ఞాన పీఠము రాష్ట్ర సలహాదారు గురుమూర్తిలు కోడుమూరు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానము పునర్ నిర్మాణాన్ని సందర్శించారు. ఆదివారం కోడుమూరు చేరుకున్న వారికి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానము కమిటీ ధర్మకర్త, తిరుమల తిరుపతి దేవస్థానము కర్నూలు జిల్లా ధర్మ ప్రచార పరిషత్తు సభ్యులు ఎద్దుల మహేశ్వరరెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. కోడుమూరులో రూ.16 కోట్లఖర్చుతో పునఃనిర్మాణము అవుతున్న శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానము నిర్మాణం పరిశీలించి రాజుల కాలము నాటి నిర్మాణముల వలే దేవస్థానం ఎంతో దివ్యమైన క్షేత్రంగా రూపు దిద్దు కుంటుందని కొనియాడారు. దేవస్థాన నిర్మాణమును ఏక వరుసతో రెండు ప్రక్కల చెక్కిన శిల్ప కళలతో, రాతి దూలములు,రాతి స్తంభములతో అత్యంత అద్భుతమైన శిల్పకళా నైపుణ్యం ఉట్టి పడుతుందన్నారు. దేవస్థానము పునఃనిర్మాణము చూస్తుంటే రాజుల కాలములో నిర్మాణం చేస్తున్న విధముగా ఉన్నట్లనిపిస్తుందని, ఈ కాలంలో కూడా ఇటువంటి నిర్మాణం చేయడము మామూలు విషయం కాదని తెలిపారు. ఈ నిర్మాణం ఏదో కలలో అద్భుతముగా ఊహించుకొనే ఊహలాగా అగుపడుతుందని సాయిరెడ్డి అన్నారు. దేవస్థానమును సందర్శించడము మా జీవితంలో ఒక అదృష్టముగా భావిస్తున్నామని, ఈ దేవస్థానం గురించి పీఠాధిపతుల దృష్టికి తీసుకెళ్లి, కోడుమూరులోని ఆలయ నిర్మాణం సందర్శనకు తీసుకొస్తామని ఎద్దుల మహేశ్వరరెడ్డికి మాట ఇవ్వడం జరిగిందన్నారు.ఇంతటి అద్భుతమైన నిర్మాణంతో దేవస్థానములు గత వంద ఏళ్ల నుండి ఎక్కడ జరుగలేదని ఈన్నారు. ఇలాంటి దేవస్థానము కోడుమూరులో రూపుదిద్దుకోవడం ఇక్కడి ప్రజల తోపాటు భారతీయ ప్రజల అందరికీ గర్వకారణమన్నారు. ఇంతటి మహా యజ్ఞమునకు శ్రీకారం చుట్టిన దేవస్థానం కమిటీ సభ్యులందరికి పేరుపేరున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినాయక నిమజ్జన కమిటీ గౌరవ అధ్యక్షులు నాగేశ్వర రావు, ఈశ్వరరెడ్డి బిజెపి మండల అధ్యక్షుడు కప్పట్రాళ్ల మహేష్ నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు సల్కాపురం సురేంద్ర, జిల్లా కార్యదర్శి ఓబీసీ జిల్లా ట్రెజరర్ నగరి అశోక్ కుమార్, వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు నటరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు షణ్ముఖ ఆచారి, దేవస్థానం కమిటీ సభ్యులు రాజశేఖర్, దామోదర్, గంగాధర్, అర్వేటి కిషోర్, వేంకటేశ్వర రెడ్డి, మధుసూదన్, రామకృష్ణ, తిమ్మారెడ్డి, వేణుగోపాల్, ఎద్దుల కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్లు, దేవస్థానం సభ్యులు ఎద్దుల సూర్య రెడ్డి, ఎద్దుల సత్య రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీడీపీ ఇంచార్జికి ఘన సన్మానం

విశాలాంధ్ర – హొళగుంద: ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జీ వైకుంఠం జ్యోతమ్మ, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం ప్రసాదుకు ఆదివారం ఆ పార్టీ నాయకులు అబ్దుల్ సుభాన్, డీఎస్ బాష, మోయిన్, జాకీర్, అబ్దుల్ రెహమాన్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా ధనాపురం రోడ్డు సమస్యను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. హొళగుందలో కొత్తమంచినీటి ట్యాంక్ నిర్మించాలని ఈద్గాలకు కొత్త సీసీ రోడ్డు, డ్రైనేజ్ వేయాలని కోరారు. ముస్లీం కబర్ స్థానకు ప్రహరీ గోడతో పాటు షాది ఖానాలు ఏర్పాటు చేయాలని మండల అభివృద్ధికి శ్రద్ధ వహించాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకుడు ఈ గోవింద గౌడ్, ఆలూరు వలి, ఆలూ రెహ్మాన్, మురళి, ఇబాదుల్లా, రాజేంద్ర గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా ఆలయం

విశాలాంధ్ర – హొళగుంద: హొళగుందలో సాయిబాబా ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సాయిబాబా 190 జన్మదిన వేడుకలను సాయి సేవకులు ఉష సంజీవరెడ్డి, రాజేష్ శెట్టి, శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సాయిబాబా కు భక్తులు కాకడ హారతి, తేజ్ ధూప హారతి, మంగళ హారతి తో పూజించి సాయిబాబా పల్లకిని సాయినామంతో జపిస్తూ భక్తులు పురవీధుల్లో తిరిగారు. జన్మదిన వేడుకలు సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజారి శ్రీకాంత్ భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయి సేవ ఉశా సంజీవరెడ్డి మాట్లాడుతూ సాయిబాబా బోధించిన బోధనాలను ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు.

ఎమ్మిగనూరులో గుర్రం జాషువ జయంతి

విశాలాంధ్ర – ఎమ్మిగనూరు రూరల్ : పట్టణంలో స్థానిక హెచ్‌బీఎస్ కాలనీ నందు నియొజకవర్గ బీజేపీ కార్యలయంలో గుర్రం జాషువ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు, ఆలూరు నియొజకవర్గ ఇంచార్జి వెంకట రమణ గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ స్వామి, గురురాజ్ దేశాయ్, పార్టీ నాయకులు జగ్గపురం ఈరన్న, ఎమ్మిగనూరు టౌన్ అధ్యక్షులు జట్టప్ప, మాజీ సర్పంచ్ రామన్న గౌడు, కౌన్సిలర్ శిల్పి భాస్కర్, 19వ వార్డు ఇంచార్జీ రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంటపోలాలను పరిశీలించిన తహసీల్దార్

విశాలాంధ్ర – గోనెగండ్ల: గత కొన్ని రోజుల నుంచి భారీగా వర్షాలు రావడంతో గంజిహళ్లి గ్రామంలో మల్లేలవాగు (పెద్దవంకా) ఎక్కిపారడంతో గ్రామంలోకి నీళ్లు వచ్చి, స్కూల్ ఆవరణంలో నీళ్లు వచ్చాయి. బైలుప్పుల, గంజిహళ్లి గ్రామానికి రాకపోకలు దాదాపు 6 గంటలు సేపు నీళ్ల నిలిచిపోయాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాలకు మేరకు తహసీల్దార్ రాజేశ్వరి గ్రామంలో సందర్శించి, పంట పోలాలను పరిశీలించారు. ఎన్ని ఎకరాల్లో పంటపోలాలు నష్టపోయాయో తెలుసు కున్నారు. తహసీల్ధార్ మాట్లాడుతూ నష్టపోయిన రైతులను జాబితా తయారు చేసి ఉన్నాతా అధికారుల దృష్టికి పంపిస్తామని తెలిపారు.

నాటు సారా అమ్మితే చర్యలు తప్పవు



విశాలాంధ్ర – హొళగుంద: దేవరగట్టు శ్రీ మాళ సహిత మాళ మల్లేశ్వర స్వామి బన్నీఉత్సవాల్లో భాగంగా సులువాయిలో ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. ఎస్సై దిలీప్ కుమార్ మాట్లాడుతూ బన్నీ ఉత్సవంలో జైత్రయాత్రలో ఎలాంటి గొడవలకు పాల్పడకుండా అల్లర్లు చేయకుండా బన్నీ ఉత్సవాన్ని జరుపుకోవాలని కోరారు. మద్యం సేవించి బన్నీ ఉత్సవంలో పాల్గొనవద్దని బన్నీ ఉత్సవాన్ని సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా సరే మద్యం అమ్మిన నాటు సారా అమ్మినచర్యలు తప్పవని హెచ్చరించారు.

డీఐజీని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్‌ను నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు కలిశారు. ప్రధాని నరేంద్ర మోదీ వచ్చేనెల కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా డీఐజీని కలిసి రాజకీయ పరిస్థితులు వివరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ అక్టోబర్ 16న కర్నూలు, నంద్యాల జిల్లాలో పర్యటిస్తున్నార న్నారు. కర్నూలులో ప్రధానితో కలిసి కూటమి నేతలు రోడ్ షో నిర్వహిస్తారని, అనంతరం శ్రీశైలం మల్లన్నను దర్శించుకొని పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని, ప్రధాని మదిలో శ్రీశైలానికి వరాల జల్లులు కురిపిస్తారని, ప్రధానంగా రోప్ వే, సున్నిపెంటకు రైలు మార్గం, నంద్యాల జిల్లాలో నవ నారసింహులు, నవనందులను భక్తులు దర్శించు కోవడానికి టూరిజం వాహనాలు, ఫారెస్ట్‌లో వాహన దారులు ఇబ్బందులు లేకుండా నాలుగులైన్ల రహదారి, సున్నిపెంటలో మినీ విమానాలు ల్యాండ్ అయ్యేందుకు మినీ ఎయిర్ పోర్ట్, తిరుమల తర్వాత శ్రీశైలాన్ని అభివృద్ధి చేయడం, 25 ఎకరాల్లో శివాజీ హబ్ ఏర్పాటు చేసి, భారీ శివాజీ విగ్రహ ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే ఆలోచన ఉందన్నారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు.

బన్నీ పండుగను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర – హొళగుంద: నేరనికి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి బన్నీ ఉత్సవాన్ని ప్రజలు, భక్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలూరు నియోజక వర్గం టీడీపీ ఇంచార్జీ వైకుంఠం జ్యోతి విజ్ఞప్తి చేశారు. దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామిని ఆదివారం ఆలూరు నియోజకవర్గం నూతన టీడీపీ ఇంచార్జీ వైకుంఠం జ్యోతమ్మ, రాష్ట్ర టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం ప్రసాద్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదం పొందారు. సీనియర్ టీడీపీ నాయకులు ఈ గోవిందు గౌడ్, మండల టీడీపీ కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య ఆధ్వర్యంలో ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జీ జ్యోతమ్మ, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం ప్రసాద్ కుగజమాల వేసి ఘనంగా సన్మానించారు. వైకుంఠం జ్యోతమ్మ మాట్లాడుతూ దేవరగట్టు బన్నీ ఉత్సవాన్ని మూడు గ్రామాల ప్రజలతో పాటు లక్షలాది మంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని అందువల్ల పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రజలతో తర్వాత ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. మండల టీడీపీ కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, సీనియర్ టీడీసీపీ నాయకుడు ఇ. గోవింద గౌడ్, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ఆదం, మురళి, వెంకటగిరి, వలి, మల్లి, అనుమప్ప, డీఎస్ బాషా, అబ్దుల్ సుభాన్, మోయిన్, జాకీర్, అబ్దుల్ రెహమాన్, ఆలూరు రెహ్మాన్, నాగేంద్ర పాల్గొన్నారు.

సజావుగా సాగిన సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర – ఆదోని రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడాయి దానమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం హాట్ టాపిక్‌ను సంతరించుకుంది. మండలంలో ప్రస్తుతం 23 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వైసీపీ చెందిన 21 ఎంపీటీసీలు, ఇద్దరు టీడీపీ ఎంపీటీసీలు ఉన్నారు. వైసీపీ నుండి కపటి గ్రామ ఎంపీటీసీ సభ్యురాలుగా బడాయి దానమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో వైసీపీకి చెందిన ఎంపీటీసీలో మండల పరిషత్ అధ్యక్షురాలుగా ఎన్నుకోవడం జరిగింది. ఎంపీపీ దానమ్మ బీజేపీలో చేరడంతో ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వైసీపీకి చెందిన ఎంపీటీసీలు వినతి అందజేశారు. ప్రారంభం అయిన వెంటనే వైసీపీ ఎంపీటీసీ సభ్యులు కోరం ఏర్పడిన తర్వాత హాజరు బుక్‌లో సంతకాలు చేసి కొందరు ఎంపీటీసీలు బయటకు వెళ్లిపోయారు. కొందరి ఎంపీటీసీలో బయటకు వెళ్లిపోయినప్పటికీ సర్వసభ్య సమావేశం సజావుగానే సాగింది. కొందరు గ్రామ స్థాయి సర్పంచులు వివిధ శాఖ అధికారుల మధ్య ఆయా శాఖల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఇంచార్జీ ఎంపీడీవో జనార్ధన్, రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సావిత్రి, ఎంపీటీసీలు శివకుమార్, నాగభూషణ్ రెడ్డి, వీరేష్ రెడ్డి,పూజారి పుష్పలత, సర్పంచ్ ప్రహ్లాద్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవధాతకు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర – ఆదోని రూరల్: ప్రజాసేవ దాతగా పేరుపొందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకులు విట్ట రమేష్ జన్మదిన వేడుకలు ఆదివారం బీమాస్ లాడ్జిలో ఘనంగా జరిగాయి. రాజకీయ పార్టీలకు అతీతంగా విట్ట రమేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంచి మనసున్న నేతగా విట్టా రమేష్ ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్న నాయకుడిగా ఆదోని పట్టణంలో ప్రజల మన్ననలు పొందుతున్నారు. గడిచిన శుక్రవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పట్టణంలో ఉన్న లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరి బిక్కు బిక్కు మంటూ జీవనం గడుపుతున్న ప్రజానీకాన్ని ఆదుకోవాలన్న సదుద్దేశంతో విట్ట రమేష్ తొలి అడుగు ముందుకు వేశారు. బాధితుల ఇళ్లలో ధాన్యపు గింజలు తడిసిపోయి వంట సామాగ్రి పగిలి పోవడంతో కనీస ఆకలిని తీర్చాలన్న మంచి ఆలోచనతో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం,రాత్రి భోజనం ఏర్పాటు చేసి విట్టా రమేష్ మానవత్వాన్ని చాటుకు న్నారు. ఆపదలో ఉన్న వారికి ఆపద్బాంధవుడుగా నిత్యం ప్రజా సేవ కార్యక్రమాల్లో విట్ట రమేష్ నిమగ్నం అవుతున్నారు. విట్టా రమేష్ మీడియాతో మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు సేవ చేయడం ఆయన పుణ్య భాగ్యంగా భావిస్తానన్నారు. తనకు సేవ చేసే శక్తినిచ్చినందుకు తన జన్మ పుణ్యఫలం సుకృతం అవుతుందన్నారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అభిమానులకు మధ్యాహ్నం భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ధనలక్ష్మి దేవి అలంకారంలో వాసవి మాత



విశాలాంధ్ర-అవుకు: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏడవ రోజు ఆదివారం వాసవి మాత శ్రీ శ్రీ ధనలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. వైసిపి ముఖ్య నాయ కులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, చల్లా రఘునాథరెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి లు ధనలక్ష్మి దేవి అలంకారంలో ఉన్న వాసవి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ధనలక్ష్మి దేవి అలంకారంలో ఉన్న వాసవి మాతకు పూజ ఉభయదారులుగా జొన్నలగడ్డ కృష్ణమూర్తి ధర్మపత్ని వాణి లు వ్యవహరించారు. ధనలక్ష్మి దేవి అలంకారంలో ఉన్న వాసవి మాతను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరము తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు తాలేపల్లి నాగేంద్ర, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు జూటూరు రాజ్యలక్ష్మి, తల్లం సుబ్బ నాగభూషణం, మల్లెల సూర్యనారాయణ, మల్లెల ఆంజనేయులు, బొగ్గరపు రామాంజనేయులు గూడూరు సుదర్శన్ బొగ్గరపు పద్మనాభం, మల్లెల సునీల్ కుమార్, జీవి సుబ్రహ్మణ్యం, మేడం సతీష్, మేడ రవిశంకర్, మారం రమణ, మల్లెల బాబి, తాలేపల్లి రాజేష్, పెండేకంటి సంతోష్ కుమార్, రావూరి రామయ్య, తల్లం సురేంద్ర, సన్నిధి శివ, రావూరి ప్రసాద్, సన్నిధి శ్రీనివాసులు, మల్లెల సతీష్ బాబు, తాలేపల్లి జనార్ధన్, వంకధార సతీష్ ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నియోజవర్గ బీజేపీ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర – బనగానపల్లె: బీజేపీ సిద్ధాంతం సేవ, సంక్షేమం అజెండాగా ముందుకెళ్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. పట్టణంలో బీజేపీ మండల అధ్యక్షులు యాదగిరి, హరికృష్ణ గౌడు, సేవా పక్వాడ ఇంచార్జీ బచ్చు శరత్ చంద్ర కుమార్‌ల ఆహ్వానం మేరకు బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మధు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జాతీయ కౌన్సిల్ సభ్యులు మేడ మురళీధర్, రాష్ట్ర నాయకులు బి.లింగన్న, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు బండి కిరణ్, కసెట్టి చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు రమణ, ఉపేంద్ర రెడ్డి, చాందిని నిమ్మకాయ సుధాకర్, కార్యదర్శిలు ఎస్సీ మోర్చా నాయకులు తప్పేట ప్రసాదు, బాలముని, మండల అధ్యక్షులు రవికుమార్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరా వేషాల వారికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : దసరా శరన్నవరాత్రి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని వేషాలు వేసే పట్టణంలోని బైటిపేట ఖాళీ మాత టీమ్ కు 38వ వార్డు వైఎస్ఆర్ నగర్ టీడీపీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు 5 వేలు రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బుగ్గరాముడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నంద్యాలలో ఆనవాయితీగా జరిగే దసరా వేశాలు ఈ సంవత్సరం మరింత మెరుగ్గా చేసి ప్రజలను ఆనందింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు శంకర్, బైటిపేట యువత పాల్గొన్నారు.

కాళరాత్రి మాతాగా చౌడేశ్వరి అమ్మవారు

విశాలాంధ్ర – బనగానపల్లె: మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారు శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 7వ రోజు కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఆలియా ఈవో శ్రీనివాస్ రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి, పీవీ నాగార్జున రెడ్డి, ఆలయ పండితులు పర్యవేక్షించారు.

శ్రీ శారదా దేవి అలంకారంలో వాసవి మాత

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారు ఆరవ రోజు ఆదివారం రాత్రి శ్రీ శారదా దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు దేవిశెట్టి హరీష్ బాబు ఆధ్వర్యంలో మూలమూర్తి వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాలలో చతుసష్ట యోగిని దేవతా హెూమం, శ్రీ శారద మూల మంత్ర హెూమం కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి తమిళనాడు అంబుర్ కు చెందిన సౌందర రాజన్ శ్రీ వాసవి మాతను శారదా దేవి అమ్మవారిగా అలంకరించి భక్తుల దర్శనార్థం కొలువు మండపంలో ఉంచారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆర్యవైశ్య సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర – చాగలమర్రి : మండలంలోని చక్రవర్తుల పల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నాగేశ్వరరావు ఒంటి మీద కొద్ది రోజుల క్రితం వేడి నూనె పడి, తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం ఇటీవల ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల భిజేంద్రా రెడ్డి గ్రామానికి చేరుకుని నాగేశ్వర రావును పరామర్శించాడు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీర భద్రుడు, వైసీపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి బాబులాల్,మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, వైసీపీ నాయకులు గణేష్‌రెడ్డి, శేషురమేష్, దస్తగిరి, రెహమాన్, సుబ్బరాయుడు, సర్పంచ్ గోవిందయ్య, రామిశెట్టి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠం ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి

విశాలాంధ్ర – హొళగుంద: ఆలూరు నియోజకవర్గం నూతన టీడీపీ ఇంచార్జీ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని సీనియర్ టీడీపీ నాయకులు రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండీ ఆదం అన్నారు. మండల టీడీపీ కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య ఆధ్వర్యంలో నూతన ఆలూరు నియోజక వర్గం టీడీపీ ఇంచార్జీ వైకుంఠం జ్యోతమ్మ, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం ప్రసాదుకు సీనియర్ టీడీపీ నాయకుడు ఆదం శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఆదం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో నమ్మకంతో ఇంచార్జ్ పదివి కట్టబెట్టారని, ఇంచార్జీ ఆధ్వర్యంలో నియోజకవర్గం ప్రజల కష్టాలు తీరుతాయని స్పష్టం చేశారు. మండలంలో అధ్వానంగా ఉన్న దానాపూర్ రోడ్డును వెంటనే కొత్త రోడ్డు వెయ్యాలని సాగు, త్రాగునీటి సమస్య తీర్చాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం హాయంలో నియోజకవర్గ అభివృద్ధి ముందుకు దూసుకు వెళుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళి, కురువ మల్లికార్జున, తిమ్మారెడ్డి, వలి, గిరి, మల్లి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ చేసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర – సి.బెళగల్: మండల కేంద్రంలో ప్రభుత్వం జారీచేసిన పర్మినెంట్ రేషన్ కార్డులను ఆ పార్టీ నాయకులు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఈరన్న గౌడ్, ఎం.ధనంజయ్, చికెన్ ఈరన్న, బీమన్న, గౌస్ విద్యా కమిటీ చైర్మన్ గోవిందు, బాలాజీ వెంకటేష్, వడ్డే వీరేష్, స్వామి, ఉపేంద్ర, కేశవులు, వడ్డే రామాంజనేయులు, టీడీపీ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏడో రోజు శ్రీ మహా చండీ దేవి అలంకరణ

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: మండల కేంద్రరలోని శ్రీ అగస్టేశ్వర దేవాలయంలో పార్వతి దేవిగా, మారెమ్మ దేవాలయంలో విజయదశమి నవరాత్రులలో భాగంగా ఆదివారం ఏడో రోజు శ్రీ మహా చండీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మొదటి రోజు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి, రెండో రోజు శ్రీ గాయత్రీ దేవిగా, మూడో రోజు శ్రీ అన్నపూర్ణా దేవిగా, నాలుగో రోజు శ్రీ కాత్యాయనీ దేవిగా, ఐదో రోజు శ్రీ మహాలక్ష్మి దేవిగా, ఆరో రోజు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా ఏడో రోజు శ్రీ మహా చండీ దేవిగా ఇలా రోజు అలంకరణలో అమ్మవారు ప్రజలకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరికృష్ణ, రవి శర్మ, భాస్కర శర్మ, చిన్న ఓబులేసులు మాట్లాడుతూ అమ్మవారిని రోజు అలంకరణలో అలంకరిస్తూ రోజు కుంకు మార్చన పల్లకి సేవ అమ్మవారి ఉత్సవం, పల్లకి సేవ తదితర పూజలు చేస్తూ భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తున్నామన్నారు.

శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో అమ్మవారు



విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : పట్టణంలోని కాళికామాత అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవ రాత్రులు ఆలయ కమిటీ చైర్మన్ దురుగడ్డ రవీంద్రచారి ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా 7వ రోజు అయిన ఆదివారం కాళికామాత అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు చంద్రశేఖర ఆచార్యులు, లోకేశ్వరాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదారులచే శ్రీ చక్ర పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.